సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 11-1-2025

సంపుటి: 20 సంచిక: 246

పేజీలు: 4 వెల: రూ.1

## సమీకృత కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తిచేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జిల్లా రెవిన్యూ అధికారి రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించి ఇప్పటి వరకు నిర్వహించిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన కలెక్టరెట్ ఆవరణలో పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ గోడ నిర్మాణం తదితర పనులపై ఆర్ అండ్ బి ఎస్ఈ, కాంట్రాక్టు ప్రతినిధి ఆరా తీయగా, సంబంధిత మ్యాప్‌ను చూపించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, కలెక్టరేట్ ఏవో జి.సూర్యనారాయణ, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.



## బ్రిటీష్ పాలనకు వ్యతిరేక ఉద్యమంలో
# ఓబన్నది కీలక పాత్ర

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- కలెక్టర్ కార్యాలయంలో వడ్డె ఓబన్న జయంతి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో వడ్డె ఓబన్న కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సామాన్యుల హక్కుల కోసం పోరాడిన ఓబన్న జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశం మందిరంలో శనివారం ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న జయంతి ప్రభుత్వం కార్యక్రమంగా గుర్తించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఓబన్న గ్రామ రక్షకునిగా పని చేశారని, అయితే, బ్రిటీష్ పాలనతో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేయబడిన తర్వాత రైతులపై అధిక పన్నులు విధించడం ప్రారంభం కావడంతో, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలైందని, ఈ ఉద్యమంలో ఓబన్న కీలక పాత్ర పోషించారని, అటువంటి వారి జీవిత చరిత్ర భావి తరాలవారికి మార్గదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతులు అధికారిణి బి.అనురాధ, కలెక్టరెట్ ఏవో సూర్యనారాయణ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో..



వడ్డే ఓబన్న 218వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పి (అడ్మిన్) కె.వి.రమణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి మాట్లాడుతూ ఓబన్న సామాన్యుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఓబన్న విశిష్టతను, గొప్పతనాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ జయంతి వేడుకల్లో ఎస్‌బీ సీఐ ఇమ్మానుయెల్ రాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

జిల్లాలోని ప్రతి రైతు దగ్గర ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ కార్యాలయం నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సాంకేతిక సమస్యలుంటే త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అవసరమైన ట్రాక్ షీట్లు అందించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతు ఇంట పండగ వాతావరణం కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, రైతు ధాన్యం అమ్మిన నాలుగు గంటల్లోనే వారి ఖాతాలో జమచేస్తున్నామని తెలిపారు.

## గడ్డుకాలంలో
# గుడ్ డెసిషన్







> పద్మావతికి, ఆమె తనయుడు స్వరూప్‌కు నేరుగా జగన్‌తో సత్సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మేయర్ అభ్యర్థిగా ఎవర్ని నిలపాలన్న ప్రపోజల్స్ తీసుకోకుండానే పద్మావతికి టిక్కెటిస్తారనే విషయం ఆ పార్టీలో అందరికీ తెలుసు.
>
> నియోజకవర్గం నుంచి సీనియర్‌గా పద్మావతిని ఓ పదవిలో పెట్టి భవిష్యత్తులో పార్టీకి ఓ బలమైన నాయకుడ్ని ఇవ్వడం కోసం ధర్మాన గేదెల పురుషోత్తంను తెర మీదకు తెచ్చారు.

- పద్మావతి, పురుషోత్తమ్‌కు పదవులు
- ధర్మాన ప్రతిపాదనకు జగన్ ఆమోదం
- పార్టీకి పనిచేసినవారికి గుర్తింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా ప్రభుత్వం గడిచిన ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత విధేయతకు పట్టం కట్టినట్లు కనిపిస్తుంది. 2019 లో అధికారంలోకి వచ్చినప్పుడు మంత్రివర్గ కూర్పు దగ్గర్నుంచి స్థానిక ప్రజాప్రతినిధుల ఎంపిక వరకు భావోద్వేగ వైఖరిని కనబర్చిన జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం కావడంతో ఈసారి పార్టీ పట్ల విధేయత, అధినేత పట్ల అచంచల విశ్వాసం ఉన్నవారికే అవకాశం ఇస్తున్నట్లు అర్థమవుతుంది. జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతిని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా రూరల్ మండలం రాగోలుకు చెందిన గేదెల పురుషోత్తంను పార్టీ నియమించింది. అనేక అనుబంధ సంఘాలకు కూడా అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించినా, శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ఈ రెండు పేర్లే ఇక్కడ ప్రస్తావించడానికి అనేక కారణాలున్నాయి. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలైన తర్వాత ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ధర్మాన ప్రసాద రావు సైలెంట్ అయిపోయారు. ఆయన్ను మళ్లీ యాక్టివ్ చేయడానికి, జిల్లాలో వైకాపాను బలోపేతం చేయడానికి ఉత్తరాంధ్ర వైకాపా ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మంతనాలు జరిపినా, ధర్మాన ప్రసాదరావు ఇంకా జనజీవన స్రవంతిలోకి రాలేదు. ఈ పరిస్థితుల్లో నగరం నుంచి పద్మావతి, రూరల్ నుంచి గేదెల పురుషోత్తంలను పార్టీ రెండు కీలకమైన పదవుల్లో కూర్చోబెట్టాలని నిర్ణయించడం హర్షణీయం. వీరిద్దరూ ధర్మాన ప్రసాదరావు వర్గంలో కీలక నేతలు. అంతకుమించి గడిచిన ఎన్నికల్లో వెన్నుపోటు రాజకీయాల జోలికి పోకుండా పార్టీకి ఒక్క ఓటు కూడా పోకూడదని కృషి చేసిన నిఖార్సయిన వైకాపా సైనికులు. అన్నింటికీ మించి ఈ రెండు పేర్లను ప్రతిపాదించింది స్వయంగా ధర్మాన ప్రసాదరావే కావడం అనేక సందేహాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లయింది. జిల్లాలో కొన్ని పార్టీ పదవులు భర్తీ చేస్తున్నామని, అందుకు సంబంధించి నియోజకవర్గాల నుంచి ఇన్‌ఛార్జుల పేర్లు ఇవ్వాలంటూ సూచించినప్పుడు తన నియోజకవర్గం నుంచి ధర్మాన కేవలం రెండే రెండు పేర్లు పంపారు. ఆ రెండు పేర్లకు ఏయే పదవులు ఇవ్వాలని కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడికి సూచించారు. ఆ మేరకే పద్మావతికి జిల్లా ఉపాధ్యక్షురాలు, గేదెల పురుషోత్తంకు జిల్లా పార్టీ ప్రధాన

- మిగతా 4లో

# ఐసీడీఎస్ సీడీపీవోపై ఆరోపణలు

### న్యూ ఇయిర్ పేరుతో అక్రమ వసూళ్లు..! - ప్రాజెక్ట్ మీటింగ్‌కు డుమ్మా





(సత్యంన్యూస్, పాతపట్నం)

పాతపట్నం ప్రాజెక్టు సీడీపీవో బాధ్యతారాహిత్యంపై విమర్శలు, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నూతన సంవత్సర కానుకల పేరుతో సూపర్‌వైజర్ల ద్వారా అంగన్వాడీల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన సంవత్సరం పేరుతో సుమారు రూ.లక్ష వసూలుచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. వసూళ్లకు సహకరించిన అంగన్వాడీలను వేధిస్తున్నట్టు గుసగుసలు ఉన్నాయి. ప్రాజెక్టు పరిధిలో సమావేశాలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సమావేశాల పేరుతో ఐసీడీఎస్ సిబ్బందిని పిలిపించి గంటల తరబడి వేచి ఉంచడం ఇక్కడ షరా మామూలేనని విమర్శలున్నాయి. కార్యాలయానికి రాకుండా ఇంటి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తుంటారని విమర్శలున్నాయి. శుక్రవారం ప్రాజెక్టు పరిధిలో జరిగిన సంఘటనే నిదర్శనం. ప్రాజెక్టు పరిధిలో పాతపట్నం మండల కేంద్రంలో మెళియాపుట్టి, పాతపట్నం మండలాలకు సంబంధించి అంగన్వాడీ సూపర్‌వైజర్లకు, టీచర్లకు స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రాజెక్ట్ మీటింగ్‌కు రావాలని సమాచారం ఇచ్చి డుమ్మాకొట్టారు. ప్రాజెక్టు పరిధిలో ఎనిమిది సెక్టార్లు ఉండగా, కేవలం ఇద్దరు సూపర్‌వైజర్లు మాత్రమే ఉన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని 208 కేంద్రాలు నుంచి అంగన్వాడీలు హాజరయ్యారు. సీడీపీవో మాత్రం సొంత పనులు చూసుకొని, పండగ మార్కెట్ చేసుకొని తీరుబాటుగా సాయంత్రం 4.30 గంటలకు సమావేశ మందిరానికి వచ్చి వెళ్లిపోయారు. సాయంత్రం 4గంటల వరకు సీడీపీవో సమావేశానికి రాకపోవడంతో అప్పటి వరకు వేచివున్న అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు. ఉదయం 9 గంటలకు సమావేశానికి రావాలని చెప్పి సాయంత్రం 4 గంటల వరకు సీడీపీవో రాకకోసం మధ్యాహ్నం భోజనాలు చేయకుండా పడిగాపులు కాశారు. పాతపట్నంలోనే నివాసం ఉంటున్న సీడీపీవో అదే ప్రాంతంలో ఉన్న సమావేశమందిరానికి రావడానికి సుమారు 8 గంటలు సమయం తీసుకున్నారు. అంగన్వాడీ సిబ్బంది ఫోన్ చేసినా స్పందించలేదని తెలిసింది. సమావేశానికి ఎంత సమయానికి వస్తున్నారని సూపర్‌వైజర్ ఫోన్ చేసిన ప్రతిసారి దగ్గర్లోనే ఉన్నానని, వచ్చేస్తున్నారని సమాధానం చెప్పి సాయంత్రం 4.30 గంటల వరకు రాకుండా ఇంటిపట్టునే ఉండిపోయారు. సీడీపీవో సమావేశానికి వచ్చిన సమయానికి కేవలం 20 మంది మాత్రమే మిగిలారు. గ్రామీణ ప్రాంతాలకు చెందినవారంతా వెళ్లిపోయారు. సమయానికి సమావేశానికి రాకుండా వీడియో కాన్ఫరెన్స్ వల్ల ఆలస్యం అయిందని చెప్పి సీడీపీవో తప్పించుకొనే ప్రయత్నం చేశారు. వాస్తవంగా శుక్రవారం ఐసీడీఎస్‌కు సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ జరగలేదని ఐసీడీఎస్ పీడీ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఇదీ పాతపట్నం ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవో వ్యవహారం.

## ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఆయా వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు వచ్చాయి. నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయి. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. ప్రజాదర్బార్‌లో కింజరాపు హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

## ప్రకృతి నియమాలూ - పర్యావరణ రాజకీయాలూ

తీవ్ర వాతావరణ సంఘటనల సంవత్సరంగా, అత్యంత ఉష్ణోగ్రతల కాలంగా చరిత్రలో నిలిచిపోతూ 2024 మన నుంచి సెలవు తీసుకుంది. ఎప్పుడూ ఎరగని వడగాడ్పులు, భయంకరమైన చలిగాలులు మనల్నే కాదు శ్రీలంక, మాల్దీవుల్ని కూడా ఈ ఏడాది అతలాకుతలం చేశాయి. మొన్నటికి మొన్న 'ఫంగల్' తీరం దాటుతున్నప్పుడు పాండిచ్చేరిలో ఒకేసారి 50 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 2023లో ఆకాశానికి రంధ్రం పడినట్లు ఒకే రోజు 95 సెంటీమీటర్ల వాన కాయపట్నాన్ని (తూత్కుడి) ముంచెత్తింది. ప్రతి ఏటా ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్పంలో సగటున ఇలాంటి నాలుగు తుపాన్లు తప్పవని ఇటీవల భారత వాతావరణ శాఖ మొహమాటం లేకుండా ప్రకటించింది. ఇక మొత్తం భూమండలాన్ని పరిశీలిస్తే 1.5 డిగ్రీలకు మించి భూమి ఉష్ణోగ్రత పెరగరాదని మనం పెట్టుకున్న లక్ష్మణ రేఖ ఉత్తుత్తి గీతగా మిగిలిపోయిందనీ, 2035 నాటికి 3.1 సెల్సియస్ డిగ్రీలు పెరిగినా ఆశ్చర్యపోనక్కరలేదని హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే ఆంత్రోపోసిస్ యుగం మనల్ని అంతుబట్టని తీరాలకు చేర్చడం ఖాయం. మాంట్రియల్ ప్రోటోకాల్ (1989) ముందుకు తెచ్చిన ఓజోన్ పొర రక్షణ, క్యోటో ప్రోటోకాల్ (2005) ప్రతిపాదించిన గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు, పారిస్ ఒప్పందపు (2016) ఉష్ణోగ్రతల తగ్గింపు, గ్లాస్గో క్లైమేట్ ప్యాక్‌లోని శూన్య ఉద్గార దేశాలకు నష్టపరిహార చెల్లింపు వంటివి పర్యావరణ ప్రియులందరూ గొప్ప మైలురాళ్లుగా చెప్పుకుంటారు. వాటి విలువను తక్కువ అంచనా వెయ్యలేము. మొన్నటికి మొన్న 'బాకు' నగర అంతర్జాతీయ సదస్సులో ఆమోదించిన 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కార్బన్ మార్కెట్' స్థాపన, కార్బన్ ఉద్గారాల నికర డేటా డాక్యుమెంటేషన్ వ్యవస్థ ఏర్పాటు కూడా గొప్ప ముందడుగుగా భావించవచ్చు. కానీ పేద దేశాలకు అందించే నష్టపరిహారంపై ధనిక దేశాలు గొప్ప ఉదారతను ప్రదర్శించినట్టు అంతర్జాతీయ మీడియా కొనియాడ్డమే ఆశ్చర్యం కలిగిస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షైన్ బమ్ (ఆమె పర్యావరణ శాస్త్రవేత్త కూడా) లాగా 2050 నాటికి తాము శూన్య ఉద్గార దేశంగా మారి తీరుతామని బల్లగుద్దిమరీ చెప్పిన అధినేత ఒక్కరంటే ఒక్కరూ లేరు. అలాగే 2040 కల్లా బొగ్గు గనులన్నీ మూసేస్తామని చెప్పిన ఇండోనేషియా లాంటి దేశం ధనిక దేశాల్లో ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఉద్గారాల వరుసలో ముందున్న 24 దేశాలన్నీ పేద దేశాలకు ఆర్థిక సాయం గురించి మాట్లాడాయే తప్ప 'నెట్ జీరో' సాధిస్తామని మాటవరసకైనా చెప్పలేదు. 'మేం పర్యావరణ ధ్వంసం చేస్తాం. పేద దేశాలు విలవిలలాడుతాయి. వాటికి అంతో ఇంతో సాయం చేస్తాం' ఇదీ వాటి తీరు. ఇక నష్టపరిహారం కింద, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం ఇస్తామంటున్న నిధులు కూడా బ్యాంకులో, కార్బన్ మార్కెట్లో, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సమకూరుస్తాయి తప్ప ప్రభుత్వాలు మాత్రం పూర్తి బాధ్యత తీసుకోవట. విచిత్రం ఏమంటే సంపన్న దేశాల్లో ఎంత శాస్త్ర సాంకేతికత పెరిగినా కర్బన ఉద్గారాలేమీ తగ్గడం లేదు. ఉద్గారాల 'లెక్కల్లో లాఘవం' మాత్రం పెరుగుతోంది. ఏకీకృత అంతర్జాతీయ వ్యవస్థ ఏదీ మన భూగోళం గురించి పట్టించుకునేది లేకపోవడం పెద్ద విషాదం. ఇక కాప్ 29 సదస్సులో ఆయిల్ గ్యాస్ కంపెనీల అధినేతలు 'మేం లేకుంటే మానవుడు మళ్లీ గుహల్లో బతకాల్సిందే' అంటూ ప్రారంభ సభలోనే బెదిరింపులకు దిగడం విచిత్రాల్లోకల్లా విచిత్రం. కాలం అలా ఉంది మరి. ఎప్పుడూ ఎరగని అసమానతల వైపరీత్యం ఒకవైపు, బహుళ జాతి కంపెనీల విశ్వరూపం మరోవైపు, పర్యావరణ సమస్యనే అంగీకరించని నాయకులు పీఠాలెక్కడం ఇంకోవైపు ముప్పేట ముసురుకొస్తున్న కాలం మనది. ఇలా ప్రకృతి నియమాలూ, పర్యావరణ రాజకీయాలూ శత్రు శిబిరాలుగా మారిన కాలం మనది. సమస్య మన అభివృద్ధి నమూనాలో, ఆర్థిక విధానాల్లో, మితవాద రాజకీయ పోకళ్లలో ఉందని చెప్పేవారే కరువైన కాలం కూడా మనది. దీనికి సమాధానంగా ప్యారిస్ పరిసరాల్లో పదేళ్ల క్రితం ఏడు రోజుల పాటు స్వేచ్ఛగా చర్చోపచర్చలు జరిపిన దేశ విదేశీ విద్యార్థులు 'అందరూ అడిగే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు సముద్రాలూ అమెరికాను నిలదీస్తాయి. వాతావరణమూ చైనాను నిగ్గదీస్తుంది' అంటారు. చూడ్డానికిది భావకవిత్వంగా కనిపించవచ్చునేమో గాని ఇలాంటి భావితరం కన్నా పుడమి తల్లి రక్షణకు ప్రస్తుతానికి భరోసా ఎక్కడుంది?

## గ్రంధి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

(సత్యంన్యూస్, రాజాం)

పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు సోదరుడు గ్రంధి చినబాబు భార్య సరస్వతమ్మ అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. అదే విధంగా ప్రముఖ వ్యాపారవేత్త కొత్తా వెంకటరాజు తల్లి సూర్యకాంతం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా ఎమ్మెల్సీ పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ తలే రాజేష్, వంగర జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, కాలేపు శేఖర్, పొట్ట సత్యనారాయణ గుప్త, పాలవలస గోపి, కెంబూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 12న వివేకానంద ఉత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలను యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జి.ప్రసాదరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెహ్రూ యువ కేంద్రం, సిట్‌ల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఎన్ఈఆర్, గొండు శంకర్‌లు హాజరు కానున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 1100 మంది అనాథబాలలకు కొత్త బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు 50కుటుంబాలకు ఆహార సామాగ్రి పంపిణీ చేస్తామన్నారు.

వివిధ పోటీలలో విజేతలైన 300మంది విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరిస్తారన్నారు. అదే విధంగా ప్రముఖ నృత్య కళాకారిణి టి.నీరజ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పాడి రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

రాష్ట్రప్రభుత్వం పాడిరైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. మండలంలోని శేఖరాపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన తాడేల యశోదమ్మ, గోక మోహన్ రావు, ఎన్ని జగన్నాథం, తాడేల జగన్మోహన్ రావుల మినీ గోకులం షెడ్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కంచరాన రాజగోపాల్, పశుసంవర్ధక శాఖ ఏడి మంచు మనోహర్, ఎంపీడీవో ప్రసాద్ పండా, పాడిరైతులు, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రజలపై విద్యుత్ భారం పడకుండా సుమారు రూ.14,683 కోట్లు ప్రభుత్వమే భరిస్తుందని టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రక టన విడుదల చేశారు. గత వైకాపా ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలకు షాక్ ఇచ్చిందన్నారు. అందుకే ప్రజలు కూడా వైకాపాకు చరిత్రలో నిలిచిపోయే ఘోర పరాజయాన్ని అందించారన్నారు. చెప్పింది చేసి చూపించే చేతల ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. తమ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అదే విధంగా పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి, కూటమి ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, కూటమి మంత్రి వర్గానికి, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకట్టుకున్న తైలవర్ణ-చిత్రం

(సత్యంన్యూస్, పొందూరు)

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆ మహానుభావుని తైలవర్ణ చిత్రాన్ని స్థానిక రామ్మోహనరావు కాలనీకి చెందిన యువ చిత్రకారుడు కేత శ్రీను రూపొందించారు. ఈ చిత్రం ఎంతో సహజసిద్ధంగా ఉండి ఆకట్టుకుంటోంది. గత పదిహేను ఏళ్ళుగా ఎన్నో తైలవర్ణ చిత్రాలను గీసి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇంతవరకు దాదాపుగా 150 చిత్రాలను గీశారు. కళింగాంధ్రలో నాటి ప్రఖ్యాత కవి అడిదం సూరకవి చిత్రం ఎక్కడా దొరక్కపోతే భక్తి సమాచారం మాస పత్రిక (విజయనగరం) సంపాదకులు సముద్రాల నాగరాజు కోరిక మేరకు ఓ ఊహా చిత్రాన్ని శ్రీను రూపొందించి కృతకృత్యుడయ్యాడు. వివిధ చిత్రకళా ప్రదర్శనలలో పాల్గొని తన చిత్రకళావైభవాన్ని చాటుకున్నాడు. ముంబయిలోని ఓ విద్యాలయం నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో సైతం పాల్గొన్నాడు. ఏకలవ్యుని తరహాలోనే గురువు లేకుండానే చిత్రకళను



స్వయం కృషితో సాకారం చేసుకోవడం ఎంతయినా అభినందనీయం. నాటి రవివర్మ నుంచి నేటి తుంబలి శివాజీ, మణిపాత్రుని నాగేశ్వరరావు, వాడాద రాహుల్ పట్నాయక్ వంటి ప్రముఖ చిత్రకారులు గీసిన చిత్రాలను పరిశీలించి ఈ కళలోని మెళకువలను నేర్చుకున్నాడు. గతంలో ఈ చిత్రకారుని ప్రతిభను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ చిత్రకారుడు స్థానిక భాష్యం పాఠశాల బస్సు సర్వీసులో పని చేస్తున్నాడు.




శంకర్ షణ్ముంగం దర్శకత్వంలో మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన "గేమ్‌ఛేంజర్" సినిమా ఎట్టకేలకు నిన్న శుక్రవారం విడుద లైంది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనలను అందుకుంది. రివ్యూలు కూడా ఏమంత గొప్పగా లేవు. తెలుగులోనే కాదు, తమిళ హిందీ మలయాళ భాషల్లోనూ తొలిరోజు ఆశించిన స్థాయిలో రెస్పాన్స్ రాలేదని తెలుస్తోంది.

# అక్కడ జీరో షేర్!


హీరో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కుతున్నా, శంకర్ అవుట్ డేటెడ్ ఫ్లాట్ స్క్రీన్‌ప్లే సినిమాను దెబ్బ కొట్టిందని ఆడియన్స్ అభిప్రాయ పడుతున్నారు. 'గేమ్ ఛేంజర్'లో చర్చించిన రాజకీయాలు భారతదేశంలోని ఏ రాష్ట్రంలోనూ అసాధ్యమని, లాజిక్ లేకుండా తీశారని చాలా మంది సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారు. సాంగ్స్ కోసం 75 కోట్లు చేసి విజువల్ వండర్ తీర్చిదిద్దే ప్రయత్నం చేసిన శంకర్.. మిగతా సినిమా మేకింగ్ మీద కూడా మరింత దృష్టి పెట్టాల్సిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ 'గేమ్ ఛేంజర్' సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇస్తారని తమిళ తంబీలు ఆశించారు. 'ఇండియన్ 2' డిజార్డర్ ఫలితంతో విమర్శలు ఎదుర్కోవడంతో, ఈసారి బ్లాక్ బస్టర్ హిట్టుతో అందరికీ సరైన సమాధానం చెప్పాలని కోరుకున్నారు. కానీ దర్శకుడు మళ్లీ యావరేజ్ సినిమాతో ప్రేక్షకులను నిరాశపరిచారు.తమిళనాడులో తొలిరోజు బుకింగ్స్ చాలా సెంటర్లలో యావరేజ్‌గా ఉన్నాయి. శంకర్ బ్రాండ్, RRRస్టార్ ఉన్నప్పటికీ ఈ సినిమా తమిళ మార్కెట్ లో ఏమంత గొప్ప ఓపెనింగ్స్ సాధించలేదు. హిందీ బెల్ట్ లోనూ రామ్ చరణ్ మూవీ పరిస్థితి అలానే ఉందని తెలుస్తోంది. 'పుష్ప 2' చిత్రాన్ని ఆదరించిన ఉత్తరాది జనాలు.. 'గేమ్ ఛేంజర్' పట్ల పెద్దగా ఆసక్తి కనబరచలేదు. కాకపోతే నిన్న నైట్ షోలలో నార్త్ ఇండియాలో కొన్ని మేజర్ సిటీస్‌లలో సూపర్ స్ట్రాంగ్‌గా నిలబడిందని ట్రేడ్ వర్గాలు తెలిపాయి. మలయాళంలో 'గేమ్ ఛేంజర్' సినిమాకి భారీ ఎదురు దెబ్బ తగిలినట్లుగా చెబుతు న్నారు. కేరళలో ఫస్ట్ డే అసలు థియేటర్ షేర్ రాలేదని అంటున్నారు. 'రాధే శ్యామ్' తర్వాత, కేరళలో ఓపెనింగ్ డే నాడు జీరో షేర్ నమోదు చేసిన టాలీవుడ్ పాన్ ఇండియన్ స్టార్ సినిమా ఇదేనని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఇక నార్త్ అమెరికాలో తొలిరోజు 437 లోకేషన్స్‌లో $ 318,447 వసూలు చేసినట్లుగా నివేదించబడింది. ఉత్తర అమెరికాలో తెలుగు - $ 289K, హిందీ - $24K, తమిళం - $ 5.5Kగా "గేమ్‌ఛేంజర్" కలెక్షన్స్ ఉన్నాయని రిపోర్ట్స్ తెలిపాయి. ప్రస్తుతం యూఎస్ఏలో 'గుంటూరు కారం' కంటే తక్కువ ట్రెండ్‌లో ఉందని అంటున్నారు. మంచి నంబర్స్ రావాలంటే బలమైన వాక్-ఇన్‌లు అవసరం వుంది. ఫస్ట్ డే ఎక్కువగా అభిమానులు, విమర్శకులు మాత్రమే సినిమాను చూస్తారు. రెండో రోజు నుంచి థియేటర్లకు వచ్చే సాధారణ ప్రేక్షకులపై మాత్రమే సక్సెస్ ఆధారపడి ఉంటుంది. మరి పొంగల్ సీజన్‌ను క్యాష్ చేసుకుని, బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకెళ్తుందో లేదో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# బాధలోనూ.. ఫన్!





స్టార్ హీరో సమంత గత ఏడాది మయో సైటిస్ వ్యాది కారణంగా చాలా బాధ పడ్డ విషయం తెల్సిందే. ఏకంగా ఏడాది పాటు ఆమె షూటింగ్స్‌కి దూరంగా ఉంది. ఆమె నటించిన సినిమాలు ఈ మధ్య కాలంలో పెద్దగా రావడం లేదు. చాలా కాలం క్రితమే నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 2024లో ప్రేక్షకులను పెద్దగా ఎంటర్‌టైన్ చేయని సమంత 2025లో మాత్రం రెండు మూడు సినిమాలతో రావాలని చాలా పట్టుదలతో ఉంది. ఇప్పటికే ఆమె కొన్ని సినిమాలు కమిట్ అయ్యి షూటింగ్స్ సైతం చేస్తుంది. కానీ ఆమెను వరుసగా అనారోగ్య సమస్యలు వేధిస్తున్న కారణంగా ఈ ఏడాదిలో ఆమె అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హీరోయిన్‌గా సమంతకు మంచి డిమాండ్ ఉంది. అయినా ఆమె వరుస సినిమాలు చేయడం లేదు. లేడీ ఓరియంటెడ్ సినిమాలను ఆచితూచి ఎంపిక చేసుకుంటుంది. వెబ్‌సిరీస్‌లపై ఆసక్తి ఎక్కువగా చూపిస్తుంది. తాజాగా ఈమె చికెన్‌గున్యా సమస్యతో బాధ పడుతున్నట్లు చెప్పుకొచ్చింది. మెల్ల మెల్లగా ఆ జబ్బు నుంచి సమంత బయట పడుతోంది. ఆ విషయాన్ని స్వయంగా సమంత చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో ఎప్పటిలాగే తన హెల్త్ అప్‌డేట్‌ను ఇచ్చిన సమంత చికెన్ గున్యా నుంచి కోలుకోవడం కోసం వర్కౌట్‌లు చేస్తున్నట్లు చెప్పుకొచ్చింది. ప్రస్తుతం తాను చికెన్ గున్యాకి సంబంధించిన చికిత్స తీసుకుంటూ వర్కౌట్‌లు చేస్తున్నాను అంది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్ల నొప్పులను పోగొట్టుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నంలోనూ ఫన్ ఉంది అంటూ ఈమోజీలను షేర్ చేసింది. విపరీతమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న సమంత తన బాధను చూపించే విధంగా ఈమోజీలను షేర్ చేసింది. బాధలోనూ జిమ్‌లో సమంత వర్కౌట్‌లు చేస్తుందట. చికెన్ గున్యా వల్ల వచ్చే తీవ్రమైన నొప్పులను పోగొట్టుకోవాలి అంటే ఇలాంటి వర్కౌట్‌లు చేయాలి అంటూ కొందరు సమంతకు సలహాలు ఇస్తున్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలను తన డైట్, తన వర్కౌట్‌లతో పోగొట్టుకున్న సమంతకు ఈ చికెన్ గున్యా కీళ్ల నొప్పులు పెద్ద సమస్య కాకపోవచ్చు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమంత నటించి 'సిటాడెల్' వెబ్‌సిరీస్‌కి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమాలో సమంత నటించేందుకు రెడీ అవుతుంది. అంతే కాకుండా సమంతతో ఒక వెబ్ సిరీస్‌కు ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి అంటూ బాలీవుడ్ మీడియాలో ఆ మధ్య కథనాలు వచ్చాయి. సమంత కోలీవుడ్, టాలీవుడ్‌లో సినిమా ఆఫర్లు వచ్చినా సున్నితంగా తిరస్కరిస్తుందని తెలుస్తోంది. ముందు ముందు ఆమె నుంచి కేవలం హిందీ సినిమాలు, సిరీస్‌లు మాత్రమే వస్తాయేమో అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నాగ చైతన్య నుంచి విడిపోయిన తర్వాత సమంత మెల్ల మెల్లగా టాలీవుడ్‌కి దూరం అవుతూ వస్తుంది. మంచి డిమాండ్ ఉన్నా సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపడం లేదు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

## పారిశుధ్య కార్మికుల బకాయిలు చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలు జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి సుధారాణి, పనుకు మంజులు మాట్లాడుతూ అంబేద్కర్ గురుకులాల్లో 2019 నుండి హౌస్ కీపింగ్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. సుమారుగా 7సంవత్సరాలుగా పనిచేస్తున్నా వారి పరిస్థితి దినదినగండంగా మారిందని, చాలీచాలని వేతనాలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారీ ఉద్యోగ భద్రత లేదని, వస్తున్న కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వీరి పట్ల వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయం సూపరింటెండెంట్ రమణయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, సుజాత, విజయకుమారి, కుమారి, పద్మా, రవణమ్మ, గౌరమ్మ, రజిని, వరలక్ష్మి, పుష్ప, కర్రి లక్ష్మి, అల్లు రవణమ్మ, పల్ల లక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

(సత్యంన్యూస్, రణస్థలం)

సంక్రాతి వేడుకల్లో భాగంగా మండలంలోని కొండములగాం గ్రామంలో స్థానిక ఎంపీటీసీ రెడ్డి వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను వైకాపా ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పిన్నింటి సాయికుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో సుమారు 20 టీంలు పాల్గొనడం ఆనందంగా ఉందని, క్రీడలు యువతకు మానసిక ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా శారీరక దారుఢ్యాన్ని కూడా ఇస్తాయన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో నైపుణ్యం గల కొత్త క్రీడాకారులను దేశానికి పరిచయం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, ఎంపీటీసీ రెడ్డి వాసుదేవరావు, మాజీ సర్పంచ్ కలిశెట్టి కన్నంనాయుడు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## వైకాపా అధికార ప్రతినిధిగా కోట

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



వైకాపా జిల్లా అధికార ప్రతినిధిగా నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు కోట గోవిందరావు నియమితులయ్యారు. ఈమేరకు తనకు ఈ పదవి రావడానికి రావడానికి కారణమైన వైకాపా రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్ జగన్మోహనరెడ్డి, కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాంలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా, పాటిస్తూ, పార్టీ పురోభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కోట గోవిందరావు ఈ సందర్భంగా తెలియజేశారు.

## వికలాంగునికి వీల్‌చైర్ అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


నగర పరిధిలో శనివారం సింహద్వారం దగ్గర మెడికవర్ హాస్పిటల్‌లో కనిమెట్ట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి కిరణ్‌కు డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వీల్‌చైర్‌ను ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అందజేశారు.

## ఏపీ.టికె.ఎస్ఎస్ మండల అధ్యక్షులుగా యారబాటి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా యారబాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తూర్పు కాపు సంఘానికి, నిస్వార్థ సేవలందిస్తానన్నారు. తనకు అధ్యక్ష పదవి రావటానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలని, సంఘానికి మంచి చేస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తానన్నారు.





## రాయల్ ఓక్ నూతన స్టోర్ ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలోని ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ ఫర్నిచర్, శ్రీకాకుళంలో తమ కొత్త స్టోర్ ప్రారంభోత్సవంతో ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. ఈ స్టోర్ ప్రారంభంతో, దేశంలో బ్రాండ్ స్టోర్‌ల సంఖ్య 172కు చేరింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయల్ ఓక్ ఇన్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, విజయ్ సుబ్రమణ్యం, మేనేజింగ్ డైరెక్టర్ మథన్ సుబ్రమణ్యం, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, కింజరాపు హరిప్రసాద్‌తోపాటుగా కిరణ్ ఛబారియా, ఫ్రాంఛైజ్ హెడ్ తమ్మయ్య కొటేరా, హెడ్- విఎం&ఎన్ఎస్ఓ కేపీ వినోద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 12000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ విస్తృతశ్రేణిలో లివింగ్ రూమ్స్, బెడ్‌రూమ్స్, డైనింగ్ రూమ్స్, ఆఫీస్ & ఔట్‌డోర్ సహా మరెన్నో వాటికి తగిన ఫర్నిచర్ అందిస్తుందన్నారు. శ్రీకాకుళం వినియోగదారులకు అనేక రకాల ఆకర్షణీయమైన మరియు పనితీరు గల వస్తువులను అత్యంత సరసమైన ధరలకు అందిస్తున్నారన్నారు. ఈ స్టోర్‌లో ప్రత్యేకంగా ఎంపికచేసిన, సేకరించిన "కంట్రీ కలెక్షన్" కూడా లభిస్తుందన్నారు. దీనిలో అమెరికా, ఇటలీ, మలేషియా, ఇండియా నుంచి పూర్తి వినూత్నమైన ఫర్నిచర్ సైతం లభించనుందన్నారు.



## ఆర్టీసీబస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, జి.సిగడాం)

మండల పర్యటన ముగించుకుని బయలుదేరి వెళ్తున్న సమయంలో అటుగా వెళ్తున్న చీపురుపల్లి -శ్రీకాకుళం ఆర్టీసీ బస్సును వెంకటాపురం జంక్షన్ దాటక కారు ఆపి తన వ్యక్తిగత సిబ్బందితో కలసి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న విద్యార్థులు, వృద్ధుల్ని, మహిళలు, పిల్లలు కండక్టర్‌తో సంభాషించారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రయాణికుల నుండి సానుకూల స్పందన రావడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు.



## మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి




(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. అఖిలభారత రైతుకూలీ సంఘం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం మెళియాపుట్టిలో భారీర్యాలీ ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి వంకల మాధవరావు మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం తర్వాత దేశవ్యాప్తంగా ఆదివాసీలకు ఐటీడీఏలు వచ్చాయన్నారు. శ్రీకాకుళంజిల్లాకు ఐటీడీఏ లేకపోవడం బాధాకరమైనదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాల విభజన సమయంలో ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోలేదన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎనిమిది నియోజకవర్గాలతో ఏర్పడగా 16 మండలాల్లో ఆదివాసీలు ఉన్నారన్నారు. ఐదు సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయని, ఒక్కటంటే ఒక్క గ్రామం 5వ షెడ్యూల్లో లేకపోవడం విచారకరమన్నారు తక్షణమే మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేసి ఆదివాసి గ్రామాలను ఐదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి ఆదివాసి సంక్షేమ పరిషత్ అధ్యక్షులు వాబయోగి మాట్లాడుతూ ఆదివాసీలకు రూల్ ఆఫ్ రోస్టర్ ఆరు శాతం ఉంటే అందులో కూడా దొంగసర్టిఫికేట్లతో నాలుగు శాతం గిరిజనేతరులు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడ ఎండయ్య, సర్పంచ్‌లు సవర వెంకటేష్, జమ్మయ్య, భాస్కరరావు, పాపారావు, గౌరేసు, జనార్ధన, ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు గణేష్ శ్రీను, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వినోద్, వీరితోపాటు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏఐఏఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఆదివాసి మహిళలు పాల్గొన్నారు.

## చిట్టిచీమ.. పెద్దబుద్ధి!



**ఐకమత్యంలోనే కాదు.. ఇంజనీరింగ్ నైపుణ్యంలోనూ చిట్టిచీమలు ఈ సమాజానికి స్ఫూర్తే. బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదే సుమతీ అంటూ బద్దెన చెప్పిన లైన్స్.. చీమల ఐకమత్యాన్ని చాటిచెప్పేవైతే.. ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారిన ఓ వీడియో వాటి ఇంజనీరింగ్ కౌశల్యాన్ని పట్టిచూపించేది. నేచర్ ఇంజనీరింగ్‌గా అభివర్ణిస్తూ ఆ చీమలకు సంబంధించిన వీడియోపై భిన్నరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటిని దాటడానికి వందాలది చీమలు కలిసి ఓ బ్రిడ్జ్ లాంటింది ఏర్పాటు చేసుకున్న ఆ వీడియో.. వాటి ఐకమత్యాన్ని, ఆ సూక్ష్మజీవుల పెద్దబుద్ధినీ చూపిస్తోంది. నెటిజన్స్‌ను విస్మయానికి గురిచేసే ఆ వీడియో ఎక్స్ (ట్విట్టర్)లో వైరల్‌గా మారింది.**

"నేచర్ ఈజ్ ఎమేజింగ్" అనే ఎక్స్ ఖాతాలో నీళ్లను దాటేందుకు చీమలు ఏర్పాటు చేసుకున్న బ్రిడ్జ్‌కు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. ఆ వీడియో చిన్న కీటకాలైన చీమల కృషి, వాటి తెలివి, అవి ఎక్కడి నుంచి ఎక్కడి చేరుకోవాలో కచ్చితత్వంతో వాటిలో కనిపించే స్పష్టత, ఒక చీమతో మరొకటి సమన్వయం చేసుకునే తీరు, వంతెన నిర్మించిన విధానం ఇవన్నీ ఆశ్చర్యపరుస్తాయి. అదే సమయంలో స్ఫూర్తి నింపేలా ఉంది ఈ వీడియో.

ఆరులక్షల మంది వీక్షించిన ఈ వీడియో ఇంకా ఇంకా వైరలవుతూ ఉత్సుకతను రేకెత్తిస్తోంది. చీమలు జట్టుగా కృషి చేయడంలో నిష్ణాతులంటూ కొందరు వ్యాఖ్యానిస్తే, మరికొందరు ప్రకృతి ఎప్పటికప్పుడు మనల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంటుందని కామెంట్ చేస్తున్నారు. ఇంకా కొందరు ఇంకో అడుగు ముందుకేసి.. మనుషుల ఇంజనీరింగ్ నైపుణ్యం కంటే కూడా ఆ చీమల వంతెన నిర్మాణాన్ని, వాటి కౌశల్యాన్ని కొనియాడుతున్నారు. అవి అంత పరిపూర్ణంగా ఒక్కటై అలా పనిచేయడం అసలు నమ్మలేకపోతున్నామంటూ మరి కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక చీమల ఐకమత్యాన్ని ఈ మానవ సమాజం కల్గి ఉంటే ఇంకెన్ని వండర్స్ సాధించొచ్చో ఆలోచించండంటూ కొందరు ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలనే సూచనలు చేస్తున్నారు. సూక్ష్మజీవుల చాతుర్యాన్ని, బుద్ధి కుశలతను పట్టిచూపే ఈ నేచర్ ఇంజనీరింగ్ వండర్ ఇప్పుడు ఇంటర్నెట్ ట్రెండింగ్ స్టోరీగా మారింది.



- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## క్రీడా స్ఫూర్తిని చాటండి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

యువత క్రీడా స్ఫూర్తితో మెలిగి, గెలుపు వాటములను సమానంగా తీసుకోవాలని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస జూనియర్ కాలేజీలో ప్రారంభించిన ఏపిఎల్-2025 టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలిగి స్నేహ సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. యువతకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని యువత తప్పనిసరిగా ఆటలాడాలన్నారు. డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాల బారిన పడి యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల తమ ఒక్కరి జీవితమే కాకుండా తన కుటుంబము, పరిసరాల్లో ఉండే స్నేహితులు అందరి జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. విద్యార్థి దశలో చదువు, లక్ష్యం పట్ల దృష్టి కేంద్రీకరిస్తే భవిష్యత్తు ఎంత గొప్పగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ గీత విద్యాసాగర్, సనపల మోహన్ సురేష్, పొన్నాడ శ్రీధర్, నేతాజీ, రాజకీయ నాయకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





పాతపట్నం నియోజవర్గం కొత్తూరు మండలం కడుము గ్రామంలో గతంలో ఏనుగుల దాడిలో గాయపడిన కిల్లారి రాములు కుటుంబానికి అటవీశాఖ ద్వారా మంజూరైన రూ.75 వేలు నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ పట్ట అమ్మన్నాయుడు, ఈశ్వరరావు, ఎఫ్ఎస్ఓలు యశస్వీ, కె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, పాతపట్నం

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## ధనుర్మాసంలో కూడారై విశిష్టమైనది



(సత్యంన్యూస్, రేగిడి)

ధనుర్మాసంలో కూడారై విశిష్టమైనదని వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాదాచార్యులు అన్నారు. శనివారం పనసలవలస గ్రామంలోని శ్రీ రాజవేణుగోపాలస్వామి ఆలయంలో 108 గంగాలాలతో కూడారై ప్రసాదం స్వామి వారికి నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. పాలు, బియ్యం, బెల్లం, నెయ్యి కలిపిన ప్రసాదం తినడం వల్ల ధనుర్మాస ఫలం లభిస్తుందని ప్రతీతి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమల కౌసల్యాదేవి, ప్రధాన అర్చకులు పీసపాటి రవి ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా సనపల



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

శ్రీకాకుళం జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు నియమితులయ్యారు. ఈ మేరకు తనను ప్రతిపాదించి సిఫార్సు చేసినందుకు ఎచ్చెర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త గొర్లె కిరణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సమన్వయకర్త సిఫారసులను ఆమోదించిన రాష్ట్ర వైకాపా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెడుతూ తన సాయశక్తుల పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైకాపా నాయకులు, కార్యకర్తలకు ముందస్తుగా సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు.







## వాకర్స్ గవర్నర్‌గా మురళీధర్ ప్రమాణస్వీకారం





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్ ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం. ప్రభావతి నూతనగవర్నర్ మురళీధర్‌తో పాటు క్యాబినెట్‌తో ప్రమాణ స్వీకారాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి చేయించారు. వాకర్స్ పూర్వ గవర్నర్ జామి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభావతి మాట్లాడుతూ నడకతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, సామాజికసేవతో మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. రెండింటిని కలబోసి సమాజానికి అందించడమే వాకర్స్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. 15 ఏళ్లుగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలో వివిధ హోదాల్లో పని చేయడమే కాకుండా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే మురళీధర్ గవర్నర్గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఐతం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ మురళీధర్ నాలుగు దశాబ్దాలుగా అందిస్తున్న సామాజిక సేవతో నేడు వాకర్స్ గవర్నర్ స్థాయికి ఎదగడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు డాక్టర్ నాగేశ్వరరావు, ఐ.గున్నేశ్వరరావు, కర్రోతు సత్యం, ఎస్.వి.ఎం.రాజు, డి.సూర్యనారాయణమూర్తి, వి.సురేష్ బాబు, వి.సుబ్బరాజు తదితరులు మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్య సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు నిరంతరం కృషి చేస్తుంటారన్నారు. నూతన గవర్నర్ మురళీధర్ మాట్లాడుతూ తాను చేపట్టే సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నింటికీ కుటుంబంతో పాటు మిత్రులు, సన్నిహితులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కొంక్యాన గోవిందరాజులు ట్రస్టు సభ్యులు కొంక్యాన రాధాకృష్ణ, కొన్న నరసింహమూర్తి, కె.గోవిందరావు, కొంక్యాన శివ శంకర్, వాకర్స్ పూర్వ గవర్నర్లు కె.వి.రమణమూర్తి, గుడ్ల సత్యనారాయణ, ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, సుగంధం సంజీవరావు, ఎస్.ఎస్.ఎస్.రాజు, తిరుపతిరావు, ఓంకారస్వామి, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, కొంక్యాన వేణుగోపాల్, జేసీస్ శ్రీకాకుళం బ్రాంచి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జామి భీమశంకర్, జేసీఐ గ్రీన్‌సిటీ ప్రతినిధులు బెందాళం వరలక్ష్మీ, తమ్మినేని ఉషా రాణి, గేదెల లక్ష్మీ, జి.తులసీబాయి, డి.కవిత, కె.సావిత్రమ్మ, సదా లక్ష్మీ, విజయలక్ష్మీ, వెంకటరమణమ్మ, కె.నరసింహమూర్తి, రాధా కృష్ణ, ప్రొఫెసర్ కామరాజు, పాండ్రంకి మురళీ, కుశరాజు, పొట్నూరు నాగేశ్వరరావు, బసవరాజు, సీనియర్ న్యాయవాదులు పైడి వేణుగోపాలం, డాక్టర్ ఎన్ని సూర్యారావు, కొంక్యాన సుభాష్, శ్రీసుమిత్రా కళాసమితి ప్రతినిధులు ప్రధాన విజయరాం, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, శాలిహుండాం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, మూడు జిల్లాల నుంచి వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.







## పింఛనుదారులకు లైఫ్ సర్టిఫికెట్లు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా సంఘం ద్వారా ఈ నెల 6 నుంచి ఇప్పటి వరకు శ్రీకాకుళం ఎన్జీవో హోంలో సుమారు 720 మంది ప్రభుత్వ పింఛనుదారులకు నేరుగాను, కదలలేని, అనారోగ్యంతో ఉన్న 90 మందికి ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు అందించినట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు కె.సోమసుందరరావు తెలిపారు. శ్రీకాకుళం ఖజానాశాఖ ఉప సంచాలకులు రవికుమార్ వారి సిబ్బందితో ఈ నెల 6న ఈ లైఫ్ సర్టిఫికెట్ల కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం విదితమే. ఎన్జీవో హోంలో ఈ వారం రోజులు సంఘ సభ్యులు హాజరై పింఛనుదార్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు చేయించారు. కదలలేని వృద్ధ పింఛనుదారులకు వారి ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్స్ చేయడం పట్ల వారు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, జిల్లా సంఘ అధ్యక్షులు కె.సోమసుందరరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి పిఎస్ ప్రసాదరావు, జిల్లా సంఘ అసోసియేషన్ అధ్యక్షులు పి. నరసింహమూర్తి, జిల్లా సంఘ కోశాధికారి కే. వెంకటేశ్వరరావు, బి.జానకిరామ్‌పట్నాయక్, ఎన్ఎస్ పండా, కె.రామమోహనరావు, ఎల్.నందికేశ్వరరావు, వి.నాగేశ్వరరావు, బి.చిన్మయరావు, ఎన్. కోటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, కె.సవరయ్య తదితరులు హాజరయ్యారు. పండగ అనంతరం లైఫ్ సర్టిఫికెట్లు కార్యక్రమం కొనసాగుతుందని, త్వరలో ఆయా తేదీలను ప్రకటిస్తామన్నారు.

## గడ్డుకాలంలో గుడ్ డెసిషన్

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి పదవులు వచ్చాయి. వాస్తవానికి ఈ రెండు పోస్టులను ఎప్పుడో ఖరారు చేశారు. కాకపోతే పార్టీ శుక్రవారం సాయంత్రం ప్రకటించింది. గడిచిన ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి మీద ద్వేషంతోనో, ధర్మాన ప్రసాదరావు మీద కోపంతోనో నియోజకవర్గంలో చాలామంది వైకాపా కార్యకర్తలు, నాయకులు పరోక్షంగా టీడీపీకి సహకరించారు. మరికొందరైతే సైలెంట్ అయిపోయారు. కానీ ఇప్పుడు ఈ రెండు పదవులూ దక్కించుకున్న నేతలు పార్టీకి ఎదురుగాలి వీస్తుందని తెలిసినా కూడా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ధర్మాన ప్రసాదరావు 2019లో గెలిచిన తర్వాత మొదటి రెండున్నరేళ్లు మంత్రి పదవిలో లేనని కార్యకర్తల ముందు నిరాసక్తత వ్యక్తం చేసేవారు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవి వచ్చినా విజయవాడలో పలికినవారే లేరని కార్యకర్తలను దూరం పెట్టారు. ధర్మాన వాదనలో వాస్తవం లేకపోలేదు. కానీ స్థానికంగా ఉండే కార్యకర్తలందరికీ విజయవాడలో మాత్రమే పనులుండవు.. స్థానికంగా కూడా వ్యక్తిగత అవసరాలుంటాయి. కనీసం వాటిని కూడా ఆయన పేషీ గడిచిన ఐదేళ్లలో పట్టించుకోలేదు. రోడ్లు, కాలువలు వంటి అభివృద్ధి పనులకు ఎలాగూ అప్పటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు విదిల్చలేదు. కనీసం జగన్మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాల్లోనైనా తమవారి పేర్లు ఉండేటట్లు చూడాలని ధర్మానను కలిసినా పని జరిగిన సందర్భాలు లేవు. తన చేతిలో ఏమీ లేదని, అంతా వాలంటీర్లు, వార్డు సచివాలయాలే చూసుకుంటున్నాయని తేల్చేసేవారు. అదే సమయంలో మిగిలిన నియోజకవర్గాల్లో వాలంటీర్లను తమ ఆధీనంలో పెట్టుకొని అప్పటి సిట్టింగులు పనులు చేయించుకున్నారు. అయితే వేవ్‌లో అందరూ కొట్టుకుపోయారు. కానీ ధర్మాన ప్రసాదరావు వంటి సీనియర్లకు మాత్రమే అన్ని ఓట్ల తేడా రావడానికి కారణం ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్లు పట్టు వదిలేయడమే. ధర్మాన ఔనన్నా, కాదన్నా ఆయన్నే అంటిపెట్టుకొని నియోజకవర్గంలో రాజకీయాలు నెరుపుతూవచ్చారు పద్మావతి. వైకాపా తరఫున ఒక వైపు వరం కుటుంబం, మరోవైపు మెంటాడ కుటుంబం తనకు ఓటును తెచ్చిపెడతాయని ధర్మాన భావించినా, చివరి నిమిషంలో వరం సంతానం టీడీపీ గూటికి చేరిపోయింది. దీంతో నగరం మొత్తాన్ని పద్మావతి మాత్రమే హ్యాండిల్ చేయాల్సిన పరిస్థితి గడిచిన ఎన్నికల్లో ఏర్పడింది. కానీ అప్పటికే నగరంలో సగభాగంలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయినా ఎక్కడా పోలింగ్ బూత్‌లలో పట్టు సడలకుండా కేడర్‌ను నిలిపారంటే అందుకు కారణం నగరంలో పద్మావతే. స్వతహాగా జగన్మోహన్‌రెడ్డి మీద విపరీతమైన వ్యతిరేకత ఉన్నా నగరంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేజారిపోకుండా అటువంటి గొడవలు ధర్మాన బంగ్లా వరకు వెళ్లకుండా ఆమె ఆపగలిగారు. ఒకానొక సమయంలో ఎమ్మెల్సీ రేసులో ఉండి కేవలం ధర్మాన సోదరుల వల్లే ఆ పదవిని కోల్పోయారని తేలినా నాయకుడి పట్ల విశ్వాసాన్ని మాత్రం ఆమె వీడలేదు. స్థానిక హయాతినగరంలో జరిగిన ఓ సభలో ఎమ్మెల్సీ నర్తు రామారావే ధర్మాన సోదరుల దయ వల్ల తనకు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పినప్పుడు అదే వేదిక మీద ఉన్న పద్మావతి ప్రసంగించాల్సి వచ్చినప్పుడు ధర్మాన ఈ నగరానికి ఎందుకు అవసరమో, అంతకు ముందు ఏమేం చేశారో చెప్పుకొచ్చారు తప్ప ఎక్కడా తన నాయకుడ్ని చిన్నబుచ్చలేదు. పద్మావతి కుటుంబానికి విజయనగరంలో బొత్స సత్యనారాయణతో సన్నిహిత సంబంధాలున్నా ఎక్కడా ధర్మానను కాదని వ్యతిరేక శిబిరాన్ని నడిపే రాజకీయాలు చేయలేదు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలకమండలి లేకపోవడం వల్ల ధర్మాన సోదరుడ్ని కార్పొరేషన్ సూపర్ పవర్‌గా నియమించినా, తాజా మాజీ చైర్మన్‌గా పద్మావతి చేసిన ఏ సిఫార్సు చెల్లకపోయినా ఏరోజూ ధర్మాన మీద అసంతృప్తి వ్యక్తం చేయలేదు. కాకపోతే ధర్మాన సోదరుడు శ్రీను తన ఉద్యోగానికి వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి వార్డుల్లో పర్యటిస్తున్నప్పుడు నగరంలో మరో పవర్ సెంటర్ తలెత్తుతుందని పద్మావతి వర్గీయులే ఎక్కడికక్కడ ఆయన పర్యటనను అడ్డుకున్న మాట వాస్తవం. తన అన్న చెబితేనే వార్డుల్లో పర్యటిస్తున్నానని చల్లా శ్రీను చెప్పినా చివరకు పద్మావతి కుటుంబం దీనిని వ్యతిరేకిస్తుందని తెలుసుకున్న ధర్మాన తన తమ్ముడ్నే వెనక్కు తగ్గిపోమన్నారు. పద్మావతికి, ఆమె తనయుడు స్వరూప్‌కు నేరుగా జగన్‌తో సత్సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మేయర్ అభ్యర్థిగా ఎవర్ని నిలపాలన్న ప్రపోజల్స్ తీసుకోకుండానే పద్మావతికి టిక్కెటిస్తారనే విషయం ఆ పార్టీలో అందరికీ తెలుసు.

జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితుడైన గేదెల పురుషోత్తం ఎన్నికల అనంతరం ధర్మాన బంగ్లానే క్లాస్‌రూమ్‌గా ఆయన వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకుంటున్నారు. నియోజకవర్గం నుంచి సీనియర్‌గా పద్మావతిని ఓ పదవిలో పెట్టి భవిష్యత్తులో పార్టీకి ఓ బలమైన నాయకుడ్ని ఇవ్వడం కోసం ధర్మాన గేదెల పురుషోత్తంను తెర మీదకు తెచ్చారు. ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుపు కోసం ఆస్తులు సైతం అమ్ముకొని కష్టపడే తత్వం గేదెల కుటుంబానిది. పురుషోత్తం తండ్రి, తల్లి ఎంపీపీగా పని చేసినా, వీరి మీద అవినీతి మరకలు లేవు. ప్రస్తుతం ఈయన సోదరుడు చంగలరావు రాగోలు మేజర్‌పంచాయతీకి సర్పంచ్‌గా ఉన్నారు. వైకాపా హయాంలో సర్పంచ్‌గా గెలవడానికి ఆ కుటుంబం పెట్టిన ఖర్చుకు, ఆ పోస్టుకు ఏమాత్రం పొంతన కుదరదు. కాకపోతే రాజకీయాల్ని వ్యాపారంగా కాకుండా సేవ చేయాలనే కోణంతో చురుగ్గా ఉన్న పురుషోత్తం భవిష్యత్తులో ఈ నియోజకవర్గానికి బలమైన నాయకుడవుతాడని ధర్మాన నమ్మారు. అప్పజెప్పిన పనిని ఎన్ని ఆటంకాలు ఎదురైనా చేసుకుపోవడం మినహా వాక్చాతుర్యం, చతురత లేని పురుషోత్తం తాను రాజకీయాల్లో రాణించలేనేమో అని భావిస్తున్న నేపథ్యంలో ధర్మాన ప్రసాదరావు గడిచిన ఏడు నెలలుగా ఆయనకు రాజకీయ పాఠాలు చెబుతున్నారు. ఎలా ప్రసంగించాలి? స్టేజ్ ఫియర్‌ను ఎలా విడిచిపెట్టాలి? ఏ పుస్తకాలు చదవాలి? వంటి అంశాల్లో ఆయన తర్ఫీదునిస్తున్నట్టు భోగట్టా. శ్రీకాకుళం రూరల్ మండలంలో వైకాపా తరఫున ఉన్న నాయకుల్లో గేదెల పురుషోత్తం కుటుంబానిది మచ్చ లేని రాజకీయం. బహుశా ఇదే భవిష్యత్తులో పార్టీకి కలిసొస్తుందని ధర్మాన భావించి వుండవచ్చు.

ధర్మానకు, జగన్మోహన్‌రెడ్డికి మధ్య ఏమాత్రం పొసగడంలేదని జరుగుతున్న ప్రచారానికి వీరిద్దరి నియామకం ఫుల్‌స్టాప్ పెట్టింది. ధర్మాన పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా లేకపోయినా జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆయన మాటే వింటారని మరోసారి రుజువైంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.